క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి సమస్యలు



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఎన్‌ఏడీ పరిసర ప్రాంతాల్లోని పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జునను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్‌ఏడీ పరిసర ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, నేవీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఎన్‌ఎస్‌టీఎల్ వంటి పలు సంస్థలు ఉన్నాయన్నారు. నగరంలో జి–20 సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో రహదారులు, కాల్వలు, బాగు చేయాలని కోరారు. ఆహుతులను ఆకట్టుకునే విధంగా ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ సుందరీకరించాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



గోపాలపట్నం పోస్టాఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గోపాలపట్నం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా నాయకులు ఆర్. శ్రీనివాసరావు, వై.రాంబాబు ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని శుక్రవారం గోపాలపట్నం పోస్టాఫీస్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వట్టి బోగస్‌దని అన్నారు. దీనికి ఎలాంటి లక్ష్యం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్.ఆసిరినాయుడు, నారాయణ రావు, రామారావు, శ్రీరామ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రఘురామారావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం పూర్వ విద్యార్థి, ఐఐటి చెన్నై పూర్వ ఆచార్యులు సి.కాళిదాస్ రచించిన బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ఆచార్యులు జి.రఘురామారావు ఆవిష్కరించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాశ్చాత్య దేశంలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన బయోఫిజికల్ కెమిస్ట్రీపై భారత దేశంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఆచార్య కాళిదాసు ఈ పుస్తకాన్ని రచించారు. ఆవిష్కరణలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

పెదగంట్యాడ: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని స్టీల్ ప్లాంట్ డీజీఎం కె.బాబునాయక్, టౌన్ అడ్మిన్ అధికారి బోయ్, భద్రతా అధికారి కృష్ణమూర్తి అన్నారు. బీసీ రోడ్డు మార్గంలో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నందున చర్యలు చేపట్టాలని ఇంటక్ నాయకులు ఇటీవల భద్రతా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు బీసీ రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ, నాయకులు గొండేశి ప్రభాకర్‌రెడ్డి, గంగవరం గోపీ, రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 63వ వార్డులో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింథియా: ఎన్నికల మేనిఫెస్టోనే పవిత్ర గ్రంథంగా భావించి పేదప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు ఏకేసీ కాలనీ 1086321 సచివాయలం పరిధిలో శుక్రవారం వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ టీయూ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని వార్డు పరిధిలోని 300 గడపలను సందర్శించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని స్థానికులు సంతోషంగా చెప్పారు. ఆనంద్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు అక్కడికక్కడే తెలియజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ జరగని అభివృద్ధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరుగుతుందన్నారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజలు కష్టాలు తెలుసుకున్న సీఎం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ప్రజల కోసమే 'గడప గడపకు..'

ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకోవడానికే గడపగడపకు వస్తున్నామని చెప్పారు. ప్రజల తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో 40, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, దాడి సత్యనారాయణ(డిపో), రాష్ట్ర ఐటీ వింగ్ కార్యదర్శి కొల్లి నూకరెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

- నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు
- దేవస్థానం పాలక మండళ్లలో చోటు కల్పించడంపై హర్షాతిరేకాలు

మల్కాపురం: రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని పారిశ్రామిక ప్రాంత నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు అన్నారు. సుమారు 610 దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులను పాలకమండలి సభ్యులుగా సముచిత స్థానం కల్పించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా మల్కాపురం వద్ద శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గొలుకొండ రామకృష్ణ, కార్యదర్శి ఉప్పలపు లోవరాజు మాట్లాడుతూ తమ సమస్యలపై గత ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగే విధంగా తిరిగినా పనులు జరిగేవికాదన్నారు. పని చేయక పోగా తమను చులకనగా చూసే వారన్నారు. కానీ నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో తమకు స్థానం కల్పించి, గౌరవం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుల వృత్తి చేసుకుంటూ షాపులు నడుపుకొనే వారికి నెలకు 150 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ జగనన్న ఇస్తున్నారని, అంతే కాక జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా తమకు రూ. 10 వేలు సాయం అందిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు ఆలయాల్లో పాలకమండలిలో స్థానాలు కల్పించి తమకు గుర్తింపు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సూర్యారావు,ఎల్‌ఏ నాయుడు, రాజు,కరుణాకర్,నాగేశ్వరరావు,శివ,మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

- విద్యార్థులతో సెబ్ జాయింట్ డైరెక్టర్



మాట్లాడుతున్న సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

గోపాలపట్నం: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) జాయింట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నరవ బెహరా కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైతే వచ్చే అనర్థాలను వివరించారు. వీటి బారిన పడిన వారు బాగు పడరని.. కుటుంబం కూడా నష్టపోతుందని చెప్పారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 14500 సమాచారమివ్వాలని కోరారు. సమాచారం ఇచ్చివారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బెహరా కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యాపారులు యువకులనే టార్గెట్ చేస్తారని చెప్పారు. వీరి విషయంలో యువత చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి సెబ్ సీఐ సరోజాదేవి, ఎస్ఐ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాళ్లు సుకన్య, లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై విస్తృత ప్రచారం



ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త దాడి పురుషోత్తం రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బుచ్చిరాజుపాలెంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పైడి వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ పట్టభద్రులను కనీసం నాలుగు సార్లు కలిసి బీజేపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసే విధంగా అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. విజయానంద్ రెడ్డి, ఎం. నాగేంద్ర, పి. శ్రీనివాస్, నాయుడు, బాల రాజజేశ్వరరావు, సీహెచ్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



విధులు బహిష్కరించి గేటు వెలుపల ఉన్న కార్మికులు

మల్కాపురం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ సంస్థ) విస్తరణ పనుల్లో పనిచేస్తున్న స్థానికేతర కార్మికులు నినాదాలు చేశారు. ముందస్తు సమాచారం లేకుండా కార్మికులను విధుల నుంచి తొలగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పలు సమస్యలపై శుక్రవారం వారంతా విస్తరణ పనులు చేపడుతున్న రఫ్ కంపెనీ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ విస్తరణ పనుల్లో సుమారు వెయ్యి మందికి పైగా పని చేస్తున్నామన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం పని సమయం 8 గంటలు ఉండాలని, అదనంగా పనిచేస్తే ఓటీ ఇవ్వాలని, అయితే తమ చేత 10 నుంచి 12 గంటల వరకు పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. పని చేసే స్థలం వద్ద కనీస వసతులైన భోజన శాల, మెడికల్, తాగునీటి సదుపాయం, సేద తీరేందుకు విశ్రాంతి షెడ్లు ఏవీ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తక్షణం జీవో రేట్లు వర్తించేలా కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై కార్మికులు గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా స్థానికేతర కార్మికులు ఎవరూ తమ తమ విధులకు వెళ్లలేదు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

మర్రిపాలెం: మర్రిపాలెం నుంచి ఎన్‌ఏడీ వరకు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను శుక్రవారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని తన దృష్టికి రావడంతో చర్యలు చేపట్టామని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది, జీవీఎంసీ సిబ్బందితో కలిసి సంయుక్తంగా ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో స్కూళ్లు ఎక్కువగా ఉండటంతో పాదచారులు, విద్యార్థులు వెళ్లేందుకు వీలుగా ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని సూచించారు. విద్యార్థులు రోడ్లపై కాకుండా ఫుట్‌పాత్‌లపై నడిచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న 24 మందిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ సాంబశివరావు

మురళీనగర్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాలకు సంబంధించిన ఇంటర్వ్యూల్లో విద్యార్థుల సమర్థత, నైపుణ్యాలనే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. ఐఎస్‌టీడీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఒ.రామ్మోహనరావు మాట్లాడుతూ ఐఎస్‌టీడీ ద్వారా ఉన్నతమైన ఆలోచనలు పంచుకోవచ్చన్నారు. ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ ఉపయోగాలు, నియమ నిబంధనలను వివరించారు. సాఫ్ట్ టెక్ సీఈవో పి.సునీల్ మాట్లాడుతూ డిప్లొమా చేసిన విద్యార్థులకు ఉన్నత అవకాశాలు ఉన్నాయన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బోకం దేముడు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాతరంగిణి చీఫ్ వార్డెన్‌గా వినుత



ఉత్తర్వులు స్వీకరిస్తున్న డాక్టర్ వినుత

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వారి వసతి కోసం విద్యాభవన్‌ని హాస్టల్‌గా తీర్చిదిద్ది విద్యాతరంగిణిగా మార్పు చేశారు. ఈ హాస్టల్ ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్‌గా ఏయూ అప్లయిడ్ మేథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినుత నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్‌కిషోర్ బాబు నుంచి ఆమె ఉత్తర్వులు స్వీకరించారు.

పోషకాహార లోపం గల పిల్లల గుర్తింపు



డేటా సేకరిస్తున్న ఆశ వర్కర్ పార్వతి, సెక్రటరీలు చిరంజీవి, శ్రావ్య

అల్లిపురం: ఆరోగ్యమైన చిన్నారులు, కౌమార దశ బాలికలు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు, 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, రక్తహీనత ఉన్న కౌమార బాలికలు 10 నుంచి 19 సంవత్సరాలు, 49 సంవత్సరాలలోపు గర్భిణుల డేటాను ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి పోషకాహారం అందించనున్నట్లు సర్వే అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా లబ్ధిదారుల తంబ్ గుర్తింపును డేటా కలెక్షన్ చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి తెలిపారు. ఈ సర్వేలో ఆశ వర్కర్ పి.పార్వతి, వుమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ శ్రావ్య పాల్గొన్నారు.

గైస్ అభివృద్ధికి కృషి



కెమ్‌దోసా సమావేశానికి హాజరైన సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) అభివృద్ధికి కృషి చేయాలని కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం (కెమ్‌దోసా) కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కాలేజీని ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌కు తయారు చేసేందుకు తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న కెమ్‌దోసా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కెమ్‌దోసా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికుల బేజారు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తూ, కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్రప్రభుత్వ విధానాలతో కార్మికులు ఆవేదన చెందుతున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య పోరాటాలతో కేంద్రప్రభుత్వ దుశ్చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 729వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్‌ఎంఎస్–2 విభాగ కార్మికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులందరూ ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాణిక్యాలరావు, శంకర్, ఎన్.రాజు, శివ, రమణ, వేణుగోపాలరావు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల జీవితాలతో కేంద్రం ఆటలు

- సంఘం అధ్యక్షుడు నూకరాజు
- 13న పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

మల్కాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెన్షనర్ల జీవితాలతో ఆడుకుంటుందని ఆ సంఘం అధ్యక్షుడు కె.నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు.పెన్షనర్స్ సమస్యలపై 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి వస్తువు ధర పెరిగిందని, అయినా గతంలో ఇచ్చిన పింఛనే నేటికీ కొనసాగుతుందన్నారు. చాలి చాలని పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. తాము అధికారంలోకి వస్తే పింఛన్‌దారులందరికీ న్యాయం చేస్తామని, పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ పెద్దలు మర్చిపోయారని ఆరోపించారు. తమకు కనీసం రూ. 9 వేలు పెన్షన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే పెన్షన్‌కు డీఏ అనుసంధానం చేయాలన్నారు. భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఈ నెల 13వ తేదీన పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్టు చెప్పారు.ఈ ధర్నాలో పెన్షనర్స్ అంతా పాల్గొవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

జీబ్రా లైన్స్‌కు రంగులు




జీబ్రాలైన్స్ వద్ద జేడీ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్ సంస్థల సభ్యులు



గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో జీబ్రా లైన్స్ వేస్తున్న సంస్థల సభ్యులు

గోపాలపట్నం: సామాజిక సేవల్లో అందరికీ ఆదర్శంగా జేడీ ఫౌండేషన్ సభ్యులు నిలుస్తున్నారు. ఇందులో భాగంగా గోపాలపట్నం జేడీ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్ సంస్థలు సంయుక్తంగా శుక్రవారం గోపాలపట్నం పరిధిలో పలు చోట్ల జీబ్రా లైన్స్‌పై రంగులు వేశారు. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ కోరిన మేరకు ఈ పెయింటింగ్స్ వేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. గోపాలపట్నం బంక్ జంక్షన్, బాజి జంక్షన్లలో జీబ్రాలైన్స్‌కు వైట్ పెయింట్ వేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు కృషి చేయాలి



బీచ్ రోడ్డు ఫుట్‌పాత్ వర్క్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగరంలో మార్చిలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరగనున్నందున దేశ, విదేశాల నుంచి అతిథులు రానున్న దృష్ట్యా వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్–3 పరిధి సిరిపురం జంక్షన్ నుంచి ఆర్కే బీచ్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌రోడ్డులో ఉన్న ప్రజా మరుగుదొడ్లను మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, నగర సుందరీకరణ, ఇంజినీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా సిరిపురం జంక్షన్ నుంచి వైఎంసీఏ వరకు పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు చెట్లను ట్రిమ్మింగ్ చేయడం, గోడలకు పెయింటింగ్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చూడాలని, రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు వ్యర్థాలను డస్ట్‌బిన్లలో వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్‌ఎల్‌జీ శాస్త్రి, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.